క్లుప్తంగా

శ్రీనివాస్‌రావుకు నివాళి

నకిరేకల్: ఇటీవల మృతి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, లయన్స్ క్లబ్ ప్రతినిధి బిచినేపల్లి శ్రీనివాస్‌రావు చిత్రపటానికి ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ కందాల పాపిరెడ్డి, మోహన్‌రెడ్డి, వీరబ్రహ్మం, అండెం వెంకటేశ్వర్లు, ఎస్.రాంమోహన్‌రావు, సూర్యచంద్రరావు, సూర్యకుమార్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కనగల్: మండలంలోని గడ్డంవారి యడవల్లి గ్రామంలో ఆదివారం గ్రామ యువజన సంఘం సభ్యుల సమక్షంలో గ్రామ నూతన యూత్ అధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఊరుగుండ్ల విజయ్‌కి యూత్ ఫౌండర్ కొర్వి శ్రీనివాస్ నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ గౌరవ అధ్యక్షుడు దోటి సైదులు, సభ్యులు ముచ్చపోతుల నరేష్, బొమ్మకంటి లింగస్వామి, కొరివి ధనరాజ్, శేఖర్, మాదగాని శివ, చినపాక నాగార్జున, కొప్పుల సందీప్, దొమ్మేటి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మానసవిహార్ కాలనీలో..

నల్లగొండ టౌన్: నల్లగొండ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో గల మానస విహార్ కాలనీ సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–2025 సంవత్సరానికి మానస విహార్ కాలనీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎస్.చక్రపాణి తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్.చక్రపాణి, అధ్యక్షుడిగా ఆర్.నీలంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా కె.లక్ష్మణాచారి, కార్యదర్శిగా ఆర్.నాగేశ్వర్‌రావు, సంయుక్త కార్యదర్శిగా ఎం.వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా ఆర్.కిరణ్, సభ్యులుగా కె.మీనారెడ్డి, సీహెచ్.సతీష్‌కుమార్ ఎన్నికైనట్లు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నకిరేకల్: తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నకిరేకల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.సునీత ఆదివారం తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వచ్చే నెల 6వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు ఆఖరు అని వివరించారు.

ఉచిత వైద్యశిబిరం

నాంపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌ఐ లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కేతపల్లి గ్రామంలో అంబేద్కర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామగిరి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆకులపల్లి నరేష్, కొరె సాయిరాం, వెంకటయ్య, రాంబాబు, ఎడ్ల కృష్ణయ్య, అంజయ్య, చంద్రమౌళి, ప్రదీప్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బందికి అండగా ఉంటాం



నియామకపత్రం అందజేస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ: ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం టీఎన్‌జీవోస్ భవనంలో నిర్వహించిన ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ల అసోసియేషన్ ఆవిర్భావ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో నాయకుడు శ్రవణ్‌కుమార్, కార్యదర్శి కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ. రఫీ, రమేష్, ప్రవీణ్‌కుమార్, యాదగిరి, ప్రతాప్‌రెడ్డి, అబ్దుల్లా, సౌజన్య, ఎల్లయ్యలు పాల్గొన్నారు.

పద్మశ్రీ సుందరంను కలిసిన లైబ్రేరియన్ దుర్గా ప్రసాద్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ ఎన్జీ కళాశాల లైబ్రేరియన డాక్టర్ ఏ.దుర్గా ప్రసాద్ చెన్నైకు చెందిన మ్యాన్ ఆఫ్ మిలీనియం పద్మశ్రీ పలని కళ్యాణ సుందరంను ఆదివారం చెన్నైలో కలిశారు.ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 36 సంవత్సరాలు గ్రంథాలయం సమాజ సేవ చేసిన కళ్యాణ సుందరం తనకు వచ్చిన రూ. 18 లక్షలను అనాథాశ్రమాలకు, పేదల విద్యకు ఖర్చు చేశారన్నారు. అమెరికా ప్రభుత్వం సుందరం చేసిన సేవకు గాను మ్యాన్ ఆఫ్ మిలీనియం అవార్డు బహూకరించిందన్నారు. సుందరం జీవిత చరిత్రపై పుస్తకాన్ని రచిస్తున్నట్లు పేర్కొన్నారు.



బదిలీ అయిన కలెక్టర్ కర్ణన్ తల్లిదండ్రులతో రిటైర్డ్ ఐఏఎస్ చొల్లేటి ప్రభాకర్

చరిత్రకెక్కిన చర్చిలు

- శాలిగౌరారం మండలంలో 116 సంవత్సరాల పునీతజోజప్ప చర్చి
- మునుగోడులోని కమ్మగూడెం చర్చికి 77 ఏళ్లు



శాలిగౌరారం : వంగమర్తిలో గల పునీత జోజప్ప క్రైస్తవ దేవాలయం(చర్చి)



శాలిగౌరారం : ఇటుకులపహాడ్‌లో గల నిత్యసహాయమాత క్రైస్తవ దేవాలయం(చర్చి)

శాలిగౌరారం: మండలంలోని వంగమర్తి, ఇటుకులపహాడ్, అంబారిపేట గ్రామాల్లో గల రోమన్ క్యాథలిక్ చర్చి(క్రైస్తవ దేవాలయాలు)లకు వంద సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. 116 సంవత్సరాల క్రితం సువిశాల ప్రదేశంలో ఎంతో అందంగా నిర్మించిన ఈ చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు. వంగమర్తి, ఇటుకులపహాడ్, అంబారిపేట గ్రామాలకు గుంటూరు జిల్లా రెంటచింతల, ఫిరంగిపురం, పాటిబండ్ల ప్రాంతాల నుంచి రోమన్ క్యాథలిక్‌లకు చెందిన కొన్ని కుటుంబాలు వలస వచ్చాయి. వంగమర్తి గ్రామానికి 1875లో, ఇటుకులపహాడ్‌కు 1910లో, అంబారిపేటకు 1915లో వలస వచ్చారు.

పూరిగుడిసెలో ప్రార్థనలు మొదలుపెట్టి..

మండలంలోని వంగమర్తి గ్రామానికి 1875లో గుంటూరు జిల్లా నుంచి వలస వచ్చి స్థిరపడిన రోమన్ క్యాథలిక్‌లకు నాటి బ్రిటిష్ విచారణ ఫాదర్‌గా ఉన్న ఫింటోని పూరిగుడిసెలో మొదట క్రీస్తు ప్రార్థనలు చేయించారు. తర్వాత పెంకుటిల్లులో చర్చి నిర్మించారు. ఆ తర్వాత చర్చి ఫాదర్‌గా వచ్చిన తిరంజోని నేతృత్వంలో వంగమర్తి గ్రామంలో 1907వ సంవత్సరంలో పునీత జోజప్ప పేరుతో క్రైస్తవ దేవాలయం(చర్చి) నిర్మించారు. 1934వ సంవత్సరంలో మొదటిసారిగా, 2005వ సంవత్సరంలో మరోమారు పునీత జోజప్ప క్రైస్తవ దేవాలయాన్ని ఆధునీకరించారు. సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన పునీత జోజప్ప క్రైస్తవ దేవాలయం మండలంలోనే అత్యంత చరిత్ర కలిగిన రోమన్ క్యాథలిక్ చర్చిగా నిలిచింది. అదే విధంగా ఇటుకులపహాడ్, అంబారిపేట గ్రామాల్లో కూడా మొదట పూరి గుడిసెలోనే ప్రారంభమైన చర్చిలను ఆ తర్వాత ఆధునీకరించారు. ఇటుకులపహాడ్ గ్రామంలో గల నిత్యసహాయమాతా క్రైస్తవ దేవాలయాన్ని(చర్చి) ఎకరం స్థలంలో 1949వ సంవత్సరంలో నిర్మించారు. అదేవిధంగా అంబారిపేట గ్రామంలో గల లూర్దుమాతా క్రైస్తవ దేవాలయాన్ని(చర్చి) 1955వ సంవత్సరంలో నిర్మించారు. ఈ చర్చిల్లో క్రిస్మస్, గుడ్‌ఫ్రైడే వేడులకతోపాటూ గుడి (క్రైస్తవ దేవాలయం) పండుగలను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు.



మునుగోడులోని ఏసునామకరణ చర్చి



మునుగోడు : మరియామాత విగ్రహం

4 కిలోమీటర్ల దూరం వినిపించే గంట శబ్దం

శాలిగౌరారం మండలంలోని వంగమర్తి, ఇటుకులపహాడ్, అంబారిపేట గ్రామాల్లో ఉన్న పునీతజోజప్ప, నిత్యసహాయమాతా, లూర్థుమాతా చర్చిల వద్ద ఉన్న కంచు గంటలకు ఓ ప్రత్యేకత ఉంది. ఆయా చర్చిల శిఖర భాగాల్లో ఏర్పాటు చేసిన కంచు గంటలు ప్రార్థన సమయాల్లో మోగించినప్పుడు సుమారు మూడు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరం గంట శబ్దం వినబడుతుంది. వంగమర్తి గ్రామంలో పునీత జోజప్ప చర్చివద్ద ఒకేసారి మూడు గంటలు మోగుతుండడంతో ఆ గంటల శబ్ద తరంగాలు ఆహ్లాదపరుస్తుంటాయి. క్రిస్మస్ సందర్భంగా ఆయా చర్చిలను ముస్తాబు చేశారు.

గుడిసెలో మొదలైన కమ్మగూడెం చర్చి

మునుగోడు: మండల కేంద్రంలోని కమ్మగూడెంలో ఉన్న ఏసు నామకరణ దేవాలయ చర్చి క్రిస్మస్ వేడుకలను ముస్తాబయింది. పురాతన చర్చికి రెండేళ్ల క్రితం మరమ్మతులు చేపట్టారు. వివిధ రకాల డిజైన్లతో దాదాపు రూ.కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

1943లో చర్చి నిర్మాణం

మునుగోడు మండల కేంద్రంలోని కమ్మగూడెంలో గల ఏసు నామకరణ చర్చి నిర్మించి ఇప్పటికి 77 ఏళ్లు. 1910లో గుంటూరు జిల్లా నుంచి 50 కుటుంబాలకు చెందిన కమ్మ కులస్తులు మునుగోడుకు వచ్చి అప్పటి నిజాం సర్కార్‌కు చెందిన 800 ఎకరాల భూమి కొనుగోలు చేసి ఇక్కడే వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగించడం మొదలుపెట్టారు. అప్పట్లో వారు ఉండేచోట చిన్న కమ్మల గుడిసెలో ఏసు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుని ప్రార్థనలు చేసేవారు. విషయం తెలిసిన ఇటలీ దేశస్తుడు ఫాదర్ పేనేల్లి మునుగోడకు వచ్చి ఇక్కడ చర్చి కడతామని, అందుకు గ్రామస్తుల సహకారం కావాలని కోరడంతో అందరూ ఒప్పుకున్నారు. దీంతో నాలుగు ఎకరాల స్థలంలో అత్యంత విశాలమైన చర్చిని 1943లో 100 ఫీట్ల పొడవు, 30 ఫీట్ల వెడల్పు, 60 ఫీట్ల ఎత్తులో నిర్మించడం మొదలుపెట్టారు. జనవరి 2న పనులు మొదలుపెట్టి చర్చికి ఏసునామకరణ దేవాలయం అని పేరు పెట్టారు. ప్రస్తుతం ఆ చర్చి జిల్లాలోని పెద్ద చర్చిల్లో ఒకటిగా పేరుగాంచింది. ఈ చర్చిలో ఆ ప్రాంతంలో దాదాపు 150 కుటుంబాలకు చెందిన క్రైస్తవ మతస్తులు నిత్యం ప్రార్థనలు చేస్తుంటారు.

జనవరి 2వ తేదీన జాతర

ప్రతి ఏడాది జనవరి 1 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించే ఉత్సవాలకు చర్చిని ముస్తాబు చేశారు. డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగను అందరిలా జరుపుకుని జనవరి 2న నామకరణం చేసినందున ప్రతి ఏడాది పండుగ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జనవరి 1,2 తేదీల్లో రెండు రోజుల పాటు గ్రామంలోని క్రైస్తవ మతస్తులు చర్చిలోని బాల ఏసు విగ్రహాలను బ్యాండు చప్పుళ్లతో తమ ఇళ్లలోకి తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అదేవిధంగా సాయంత్రం సమయంలో చర్చి వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఫాదర్లు, బిషప్‌లు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. చర్చి వద్ద 2వ తేదీన జాతర జరుగుతుంది. జాతరకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలకు కులమతాలు అతీతంగా తరలివచ్చి చర్చిలో ఏసుక్రీస్తు విగ్రహం వద్ద కొవ్వొత్తులు వెలిగిస్తారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



చండూరులో మాట్లాడుతున్న కూసుకుంట్ల

చండూరు : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై కార్యకర్తలు అధైర్య పడొద్దని, అందరికి అండగా ఉంటామని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం చండూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు ప్రాంత అభివృద్ధి కోసం రూ.571 కోట్ల నిధులు ఉన్నాయని, ఆ డబ్బులతో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని కోరారు. ఈ సమావేశంలో పాల్వాయి స్రవంతి, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, మున్సిపల్ చైర్మన్ తోకల చంద్రకళవెంకన్న, పాటల వెంకన్న, కౌన్సిలర్లు కోడి వెంకన్న, అన్నెపర్తి శేఖర్, గుంటి వెంకటేశం, మంచుకొండ కీర్తి సంజయ్, కొండ్రెడ్డి యాదయ్య, గుర్రం వెంకట్‌రెడ్డి, తేలుకుంట్ల, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన గాజుల సుకన్య



పుష్పగుచ్ఛం అందిస్తున్న గాజుల సుకన్య

నకిరేకల్: హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం రాష్ట్ర మహిళా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, నకిరేకల్ మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్యశ్రీనివాస్ దంపతులు కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



నల్లగొండటౌన్ : వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



కనగల్ : కేక్ కట్ చేస్తున్న గడ్డం అనూప్‌రెడ్డి

నల్లగొండటౌన్: పట్టణంలోని విపస్య ది స్కూల్‌లో ఆదివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటకం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బండారు ప్రసాద్, ప్రిన్సిపాల్ గోపాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి గ్రామంలో పునీత బొజప్ప దేవాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని కేక్ కట్‌చేసి డాన్‌బోస్కో రెవరెండ్ ఫాదర్ రాజేష్‌కు, క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీఆర్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు పోలే విజయ్‌కుమార్, జంగాల దుర్గాప్రసాద్, కలకూరి వెంకన్న, పురం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి పడిపూజ



పడిపూజలో పాల్గొన్న మాలధారులు, భక్తులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పాతబస్తీ నెహ్రూగంజ్‌లో అయ్యప్ప పడి పూజ మహోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి గురుస్వాము, భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి ఆలయ చైర్మన్ కొలనుపాక రవికుమార్, మంచుకొండ శ్రీనివాస్, రమేష్, శంకర్, లక్ష్మమ్మ, సరిత, వీణ, అంజలి, గురుస్వాములు శ్యామ్, కలిశాన్ అశోక్, ప్రసాద్ గుప్తా, కంజర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు



క్లాక్‌టవర్ సెంటర్‌లో విద్యుత్ దీపాలతో సెంటినరీ సెల్ఫ్ సపోర్టింగ్ తెలుగు బాప్టిస్టు చర్చి



విద్యుత్ దీపాలతో అలంకరించిన సెంటినరీ మిషన్ కాంపౌండ్ బాప్టిస్టు చర్చి

రామగిరి(నల్లగొండ): క్రైస్తవులు జరుపుకునే అతిపెద్ద పండుగ క్రిస్మస్. ఈ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకునేందుకు చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. నల్లగొండ పట్టణంలో క్రిస్మస్ ముందురోజు ఆదివారం రాత్రి చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ గీతాలను ఆలపించారు. చిన్నారులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. తమ ఇళ్లల్లో క్రిస్మస్ ట్రీలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. సోమవారం పాస్టర్లు దైవ సందేశం ఇవ్వనున్నారు.

వేడుకల్లో పాల్గొననున్న మంత్రి కోమటిరెడ్డి

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం నల్లగొండ పట్టణంలో జరిగే క్రిస్మస్ వేడుకలకు హాజరుకానున్నారు. ఉదయం క్లాక్‌టవర్ సెంటర్‌లోని బాప్టిస్టు చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో మంత్రి పాల్గొంటారు. అనంతరం లిటిల్ ఫ్లవర్ విజ్ఞాన మందిర్‌లో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు.

నార్కట్‌పల్లిలో..

నార్కట్‌పల్లి: క్రిస్మస్ పండుగా సందర్భంగా నార్కట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న చర్చిలను విద్యుత్ లైట్లతో అలంకరించారు. చర్చి ఫాదర్ జయరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలను పలు చర్చిలలో ఘనంగా నిర్వహించారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత

- మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



అయ్యప్పస్వామికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మునుగోడు: దైవభక్తి కలిగిన ప్రతిఒక్కరిలో మానసిక ప్రశాంతత, సత్ప్రవర్తన అలవడుతుందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మండల మహాపడి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ గ్రామంలో అయితే దైవ భక్తులు అధికంగా ఉంటారో ఆ గ్రామంలో ఎలాంటి అశాంతి కనిపించదన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం మండల కేంద్రంలోని చండూరు రోడ్డులో ఇరువురు యువకులు నూతనంగా ఏర్పాటు చేసుకున్న టీ స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నారబోయిన రవిముదిరాజ్, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్యగౌడ్, జాల వెంకన్నయాదవ్, పాల్వాయి చెన్నారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, తాటికొండ సైదులు, పందుల భాస్కర్, పాల్వాయి జితేందర్ రెడ్డి, మేకల ప్రమోద్ రెడ్డి, జంగిలి నాగరాజు, సాగర్ల లింగస్వామి, ఎండీ అన్వర్, నకరకంటి యాదయ్య పాల్గొన్నారు.

బస్టాండ్ స్థలం పరిశీలన

నాంపల్లి: మండల కేంద్రంలో బస్టాండ్‌కు సంబంధించిన పనులను ఆదివారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము భిక్షం, ఎరెడ్ల రఘుపతిరెడ్డి, పానగంటి వెంకన్న గౌడ్, పూల వెంకటయ్య, శీలం జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఏడుకొండల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత

మర్రిగూడ: మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన పాక సంతోష అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సంతోషకు మంజూరైన రూ.2లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్‌ఓసీ చెక్కును భర్త సత్తయ్యకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదివారం మునుగోడులో అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాకల నగేషయాదవ్, రాందాసు శ్రీనివాస్, మేతరి యాదయ్య, పాక పరమేష్, మేతరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే

నకిరేకల్: ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో ఆవరణలో రివర్ నిమ్స్ హాస్పటల్ నల్లగొండ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలు చేసుకున్నవారికి అవసరమైతే సర్జరీలు కూడా ఉచితంగా చేస్తామని ప్రకటించడం అభినందనీయమన్నారు. క్యాంపు నిర్వహణ ఇన్‌చార్జ్ ఎండీ అమ్జద్ షరీఫ్, పూజర్ల శ శంభయ్య, వార్డు కౌన్సిలర్ యాసారం లక్ష్మీ వెంకన్న, డాక్టర్లు హేమంత్, సుబ్రమణ్యం, పల్లవి, శశాంక్, ధనంజయ్‌రెడ్డి, విజయ్‌కుమార్, నాగార్జున, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, సకినాల రవి, లింగాల వెంకన్న, యానాల లింగారెడ్డి, గునగంటి రాజు, వేమవరపు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి

నకిరేకల్ : నియోజకవర్గంలో పెండింగ్ ప్రాజెక్టులు, ఇతర పనులు పూర్తి చేయాలని కోరుతూ టీడీపీ నేతలు ఆదివారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి విన్నవించారు. రామన్నపేట ఆస్పత్రి అప్‌గ్రేడ్, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాల్వ పనులు పూర్తి చేయాలని, చిట్యాల మండలం గుండ్రాంపల్లి నుంచి వెల్లంకి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాపోలు నర్సింహ, నాయకులు నక్క రాంబానేష్, తాళ్లపల్లి సత్తిరెడ్డి, నీలా యాదయ్య, నకిరేకంటి గణేశ్, పోశబోయిప నర్సింహ, ఫజల్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చిట్యాల: మండలంలోని వెలిమినేడు జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 1990–91 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాడు తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అంతటి వెంకటేష్‌గౌడ్, ప్రభాకర్ రెడ్డి, గోపికిరణ్, సత్తయ్య, బ్రహ్మగిరి, ఉపేందర్ రెడ్డి, చంద్రమోహన్, శ్రీలత, అపర్ణ, అండాలు, ధనమ్మ, సువర్ణ, మాధవి, రమానందిని తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ శ్రీరాముడి అక్షింతలు

కేతేపల్లి: అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో అక్కడి నుంచి పంపించిన తలంబ్రాలు ఆదివారం కేతేపల్లికి చేరుకున్నాయి. ఈ తలంబ్రాలు తీసుకుచ్చిన వాహనానికి కేతేపల్లిలో బీజేపీ నాయకులు, ప్రజలు స్వాగతం పలికారు. తలంబ్రాలను శివాలయంలో భద్రపరిచారు. జనవరి ఒకటో తేదీ నుంచి తలంబ్రాలను గ్రామంలోని ప్రజలకు పంపిణీ చేస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అయితగోని అనిత తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాచకొండ గోపి, నర్సింహాచారి, రోశయ్య, విజయలక్ష్మి, లలిత అచ్చయ్య పాల్గొన్నారు.

నాంపల్లి: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో రాముడి అక్షింతలను ఆదివారం స్థానిక మార్కెండేయ స్వామి ఆలయంలో రామ భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి సంపత్ మాట్లాడుతూ జనవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతి గ్రామంలో అయోధ్య రాముడి అక్షింతలను గడపగడపకు రామభక్తులు చేరవేయాలని కోరారు. జనవరి 22వ తేదీన ప్రతి గ్రామ ఆలయాల్లో ఉదయం 11 నుంచి 12గంటల వరకు భజన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కర్నాటి శ్రీహరి, వీరమళ్ల స్వామి, దామెర జగన్, అరవింద్, నాగరాజు, పెద్ద పాపయ్య ఉన్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు

కట్టంగూర్ : ప్రమాదవశాత్తు గీతకార్మికుడు తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలైన సంఘటన పరడ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామ పెద్దగౌడ్ బద్దం రాములు తెలిపిన వివరాల ప్రకారం.. పరడ గ్రామానికి చెందిన తండు యాదయ్య రోజువారి మాదిరిగా తన వ్యవసాయ బావి వద్ద తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు యాదయ్యను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు.